# పిల్లంగ్రోవి

ఆ బాలకుని పిల్లంగ్రోవి పొలంగట్టులు, చేలు, కాలవలు, కొద్ది దూరానఉన్న కొండలు నిండుతూ ఉన్నది.

అతనికి రాగజ్ఞానంలేదు! ఆతడు స్వరవిద్య నేర్చుకోలేదు. ఆతని గురువులు కోకిల, తుమ్మెద, సెలయేరు, ఆవుల అంభారవం, చేల మీదినుంచి తేలిపోయే మలయబాలకుడు, ఉఱుము, కీచురాయి, లవంగి పిట్టలు.

ఆతనికి ఉన్న జ్ఞానమే గాంధర్వము. ఒక స్వరం ఇంకో స్వరం శ్రుతిచూస్తాడు. ఆతని ఊపిరే లయ! ఆ లయలోంచి వచ్చిన తాళాలు మూడే. ఆది, ఏక, రూపక తాళాలు.

ఆతడు కల్పించిన గీతాపధకాలు విచిత్ర మూర్ఛనలు.

## 2

గొడ్లకాపు కుఱ్ఱవాడు, తొమ్మిదేండ్లు ఈడువాడు. చలిదివన్నం గంజి ఉప్పుచేప నంజుకుంటూ మెక్కి, ముంతలో గంజివన్నం పెట్టుకొని, ఉప్పులో ఊరవేసి ఎండబెట్టిన మామిడికాయ బద్ద, కంచమూ మూటకట్టుకొని గేదెపై స్వారి అవుతూ ఏటిగట్టుకు వస్తాడు.

ఆతని సింహాసనం వేపచెట్టు నీడ, ఆతని ప్రజలు పశువులు, ఆతని ఆయుధం పిల్లంగ్రోవి!

ఆతని పట్టుపీతాంబరాలు చినిగినగోచీ, చినిగిన తలపాగాగుడ్డ! వాన వస్తే రెండు గేదెల్ని నిలబెట్టి వాటి అడుగున కూచుంటాడు. ఏరుపొంగితే

గేదెలమీద దాటుతాడు. అతని రక్షకభటులు ఆవులు గేదెలు. పెద్దపులినైనా దూరాన నిలబెట్టుతాడు.

## 3

పశువులతో మేతబయలుకు రాగానే 'పొండట్రా' అని చెట్టుకింద మకాంవేస్తాడు. ఆటలు ఆడుతాడు, పాటలు పాడుతాడు.

పిల్లంగ్రోవి తీసి భువనమోహనంగా వాయిస్తాడు. ఆ పాటలకు సాహిత్యం అతని హృదయమే!

ఒకసారి అతని పాట ఎగిరి గంతులువేస్తుంది. పూవులు పూస్తుంది. చిరుసువాసనలు వెదజల్లుతుంది. చిట్టి చిట్టి ఊటలా జలజల లాడుతుంది,

ఒకసారి ఆతని పాట లోకాన్నిచూచి ఆశ్చర్యం పడుతుంది. తెల్లబోతుంది, వణుకుతుంది.

ఒకసారి ఆతని గీతం ఏదో వెదుకుతుంది. ఆకాశాన్ని పారకించి చూస్తుంది. భూమిలోతులు చొచ్చిపోతుంది. నదీ నీరాంబుకణాలు లెక్కబెడుతుంది.

మరి ఒకసారి కంటనీరు నింపుతుంది. ఏదో ఎరగని భయంచే ముడుచుకుపోతుంది, ఆకలై శుష్కిస్తుంది, మానవుని సర్వబాధలై విలపిస్తుంది.

ఇంకొకసారి అన్నీ తెలిసిన జ్ఞానిపద్మంలా యోగముద్ర వహిస్తుంది. గడ్డిపూవుల నివేదనలిస్తుంది. ఏటిలోని చేపలులా లోతులు కనిబెట్టుతుంది.

ఆ బాలుడు పిల్లంగ్రోవి పెదవులతో చుంబిస్తూ తన సృష్టి తనకే తెలియని బాలుడౌతాడు.

## 4

ఒకరోజు ఆ పక్క పొలంలోనుంచి పొలంకూలీ బాలిక ఒకతె అతని పాటదారినే అతన్ని వెతుక్కుంటూ వచ్చింది.

ఆ బాలిక ఎనిమిదేళ్ళబిడ్డ! అతనికి ఎదురుగా అతని పాట వింటూ కదలకుండా కూరుచుంది.

ఆమెవచ్చి అతని రాజ్యాన్ని హరించలేదు, భాగించలేదు.

ఆమె అతని రాజ్యంలో, అతని పాటలో, అతనిలో భాగ మయింది.

ఆమె కూడా ప్రతిరోజూ అతడు పాటబాడేవేళకు వచ్చి అతని ఎదురు గుండా కూచునేది.

ఆ బాలికకు ఓ చింపిగుడ్డ మొలకు అగుడ్డ. ఆమె నగ్నతను పూర్తిగా కప్పనేలేదు. ఆమె చేతికి రెండు గాజు గాజులు, ఆమె కాళ్ళకు రెండు అల్యూమినియం కడియాలు.

ఆ బాలుని మోము సూర్యబింబం అవుతే, ఆమె మోము ఆ పక్క చెరువులోని పద్మమే!

## 5

ఒకదినాన అతడు పిల్లంగ్రోవి వాయిస్తున్నాడు. లోకం అంతా సమ్మోహనమై అతని పాట వింటోంది. ఆ బాలిక ఆ పాటే అయింది.

ఇంతలో లోకాలు బద్దలుచేసే ధ్వనితో ఆకాశంలో ఏదో పెద్దపక్షి.

ఆ చప్పుడుకు అదిరిపడి ఆ బాలకుడు పిల్లంగ్రోవి ఆపి గభాలున భూమిమీద పడిపోయాడు. ఆ బాలిక దద్దరిల్లి హోరుమంటూ అతనిపక్క వాలి అతన్ని కౌగలించుకొంది.

ఆ రాక్షసిపక్షి వెళ్ళిపోయింది. కొంత సేపటికి ఆ పసికందు లిద్దరూ లేచి తమచుట్టూ అంతా కళ్ళనీళ్ళతో పాటచూచారు.

ఆతని ఆవులు, గేదెలు నిశ్చలంగా మేస్తున్నాయి. పువ్వులు వికసించి వున్నాయి. వేపచెట్టు ఆవరించే ఉన్నది. సెలయేరు జలజల ప్రవహిస్తూ ఉన్నది.

ఆతడు ధైర్యం వహించి పిల్లంగ్రోవి తీసి మళ్ళీ మూడు పవిత్ర స్వరాలు కలిపాడు. ఏమీ విశ్వం అన్నట్టుగా ఒక్క మూర్ఛన వచ్చింది. ఆ బాలిక ఆతన్ని కౌగలించుకునే ఉంది.

దూరంగా యూరపులో యుద్ధం జరుగుతున్నది. జపాను పిరల్ హార్బరుపై విరుచుకుపడింది.

ఆ బాలకుడు అదటుతీరి రోజూ ఆకాశంలో వచ్చిపోయే ఆ రాక్షస పిట్టల మ్రోతకు శ్రుతికలిపి ఒక కొత్త మూర్ఛన మ్రోయించాడు. ఆ బాలిక చిరునవ్వుతో అతనిపాట పరవశయై విన్నది.